క్లుప్తంగా

ఏఆర్ఎస్ఐకి ఘన సత్కారం



ఏఆర్ఎస్ఐ సయ్యద్ ఇస్మాయిల్‌ను సత్కరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ హెడ్ క్వార్టర్‌లో పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ సయ్యద్ ఇస్మాయిల్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తన ఛాంబర్‌లో గురువారం శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆయన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, పదవీ విరమణకు సంబంధించిన సమస్యలేవైనా ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చునని ఎస్పీ హామీ ఇచ్చారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజమూర్తి, ఆర్ఐ నారాయణ, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ నర్సుకు సన్మానం



వసంతకుమారిని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హెడ్‌నర్సుగా పనిచేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేసిన వసంతకుమారిని వైద్యులు, నర్సులు ఘనంగా సన్మానించారు. ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ.. వసంతకుమారి కార్డియాలజీ విభాగంలో అందించిన సేవలను కొనియాడారు. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో జ్ఞాపకశక్తి



యోగాసనాలను ప్రదర్శిస్తున్న బాలికలు

కర్నూలు (టౌన్): యోగా వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని యోగా హాలులో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పురాణాల్లో సైతం యోగా గొప్పతనాన్ని వివరించడం జరిగిందన్నారు. యోగా వల్ల క్రమ శిక్షణ అలవడుతుందన్నారు. దేశ ప్రధాని సైతం యోగా గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేశారన్నారు. యోగాలో ధ్యానం, వ్యాయామం కలిసి ఉంటుందన్నారు. యోగాసన సంఘం కార్యదర్శి శివరాజ్ మాట్లాడుతూ.. ప్రతిభ చాటిన యోగా క్రీడాకారులు ఈ నెల 21న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, హర్షవర్ధన్, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

ఆలూరు రూరల్: మండలంలోని హులేబీడు గ్రామంలో తాగునీరు సరఫరా విషయంలో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డాయి. బుధవారం రాత్రి గ్రామంలో ఘటన జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన సర్పంచ్ మరిది రామాంజి గ్రామంలో తాగునీరు సరఫరా చేస్తుంటాడు. ఇందులో భాగంగానే బుధవారం రాత్రి గ్రామంలో ఓ సామాజిక వర్గానికి చెందిన కాలనీకి మంచినీళ్ల వదిలేందుకు వెళ్లాడు. నెలకు పైగా మా కాలనీకి మంచినీరు ఎందుకు వదలడం లేదని స్థానికులు ప్రశ్నించారు. ఈ క్రమంలో మాటామాట పెరిగి రామాంజి మరో వర్గానికి చెందిన ఆంజనేయ, గాదిలింగ,శంకర్ మరికొందరు పరస్పరం దాడులు చేసుకున్నారు. బుధవార అర్ధరాత్రి పంచాయితీ పోలీసు స్టేషన్‌కు చేరింది. ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. గురువారం గ్రామ పెద్దల సమక్షంలో వారు రాజీ అయ్యారు.

డెంగీ నివారణపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): డెంగీ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఇంటితో పాటు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మంజూష వివరించారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా.. డెంగీ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్య సిబ్బంది, స్కూల్ విద్యార్థులు పంచలింగాల గ్రామంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ×డెంగీని ఓడించండి, పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి€ అనే అంశాలపై ఆరోగ్య సిబ్బంది, స్కూల్ విద్యార్థులు నినాదాలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. డెంగీ నివారణలో ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది భాగస్వామ్యం కావాలని తద్వారా దోమలను నిర్మూలించవచ్చన్నారు.

నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): కర్నూలు నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దుదామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆగస్టు 1 నుంచి నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సరికొత్త విధానం తీసుకొస్తున్నట్లు చెప్పారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో అమలు చేయాలని ఆదేశించారు. వ్యర్థాల సేకరణకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి ట్రాక్టర్‌కు రూ.500, టిప్పర్‌కు రూ.వెయ్యి చొప్పున యజమానులు రవాణా చార్జీలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీటి కోసం ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి సచివాలయాల పరిధిలో ముగ్గురు కార్యదర్శులు బృందంగా ఏర్పడి క్షేత్రస్థాయిలో కంపోస్టు, వేస్టేజ్ నిర్వహణను పర్యవేక్షించాలన్నారు. త్వరలోనే వార్డులకు నోడల్ అధికారులను నియమిస్తామని వారి ద్వారా అన్ని పనులను పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డ్రైనేజీ కాల్వల్లో తాగునీటి పైపులైన్లను తొలగించాలన్నారు. నగర ప్రజలు సహకరించాలని, క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు తోడ్పాటు అందించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



పీఆర్ ఎస్ఈ వీ.రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ వీ.రామచంద్రారెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పీఆర్ ఈఈ మద్దన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆ శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తాను 2009లో వైఎస్సార్ కడప జిల్లాలో ట్రైనీ ఆర్డీఓగా ఉన్న సమయంలో జరిగిన ఎన్నికల్లో రామచంద్రారెడ్డి పీఆర్ ఈఈగా ఉంటూ నోడల్ అధికారిగా ఎంతో సహకారం అందించారని గుర్తు చేశారు. పల్లె పండుగ వారోత్సవాల్లో కర్నూలు జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ఎంతో శ్రమించారన్నారు. ఆర్అండ్‌బీ రిటైర్డు ఎస్ఈ జయరామిరెడ్డి, ఎస్ఈ మహేశ్వరరెడ్డి, జెడ్పీ సీఈఓ జీ.నాసరరెడ్డి, డీపీఓ జీ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఈ రామచంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా 5న ఆందోళనలు



రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5న చేపట్టే ఆందోళనలను విజయవంతం చేద్దామని ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీఐటీయూ న్యూసిటీ అధ్యక్షుడు ఆర్.నరసింహులు, ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.విజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం న్యూసిటీ, ఓల్డ్‌సిటీ కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్, రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరావు, సాయిబాబా మాట్లాడుతూ.. ఆగస్టు 5న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా చేపట్టే ఆందోళనలకు ప్రజా సంఘాలు మద్దతివ్వాలని కోరారు. టీడీపీ నాయకుడు నారా లోకేష్ గతంలో స్మార్ట్ మీటర్లను పెడితే పగలగొట్టాలని చెప్పి ఇప్పుడు కిమ్మనకుండా ఉండడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లపై లోకేష్ స్పందించాలని డిమాండ్ చేశారు.


సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



ఆటోలకు స్టిక్కర్లను అతికిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో ఆగస్టు 9, 10, 11 తేదీల్లో నిర్వహించే సీపీఐ 24వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆహ్వాన సంఘం జిల్లా అధ్యక్షుడు కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. గురువారం ఆటోలకు స్టిక్కర్లు అంటించి మహాసభలపై విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే జన్ సేవాదళ్ క్యాంపును విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భారత కమ్యూనిస్టు పార్టీ దేశ స్వాతంత్ర్యం కోసం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక కుట్రలను ఎదుర్కొని పోరాటాలు చేసిందన్నారు. భూపోరాటాలు చేసి పేదలకు గూడు కోసం ఉద్యమించిన ఘన చరిత్ర పార్టీకి ఉందన్నారు. జిల్లా మహాసభల్లో భాగంగా మొదటి రోజు వేలాది మందితో ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. మహాసభల విజయవంతానికి పార్టీ శ్రేయోభిలాషులు, పెద్దలు, దాతలు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మహేష్, డి.శ్రీనివాసరావు, వెంకటేశ్, చంద్రశేఖర్, ఈశ్వర్, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలుంటే నేరుగా కలవండి



పదవీ విరమణ పొందిన అధికారులను సత్కరిస్తున్న కమాండెంట్ దీపిక పాటిల్

కర్నూలు: పదవీ విరమణ ప్రయోజనాలకు (రిటైర్మెంట్ బెనిఫిట్స్) సంబంధించిన సమస్యలు ఉంటే తనను నేరుగా కలసి పరిష్కరించుకోవచ్చని ఏపీ ఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ అన్నారు. సుదీర్ఘ కాలం పాటు పోలీసు శాఖలో పనిచేసి ఆర్ఎస్ఐ పాండు, ఏఆర్ఎస్ఐలు సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, తాతారావు తదితరులు పదవీ విరమణ పొందారు. 1983లో కానిస్టేబుల్ హోదాలో బెటాలియన్స్ విభాగంలో చేరిన వీరు వివిధ హోదాల్లో సేవలందించి గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో నిర్వహించిన వీడ్కోలు సభకు కమాండెంట్ దీపిక పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవీ విరమణ పొందిన అధికారులను శాలువ, పూలమాలలతో సత్కరించారు. అడిషనల్ కమాండెంట్ నాగేందర్ రావు, అసిస్టెంట్ కమాండెంట్ రమణ, డీఎస్పీ సుధాకర్ రెడ్డి, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దన్న, బీఎస్ హరిశ్చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీఓ నేతకు ఘనంగా వీడ్కోలు



వెంగళ్ రెడ్డి దంపతులను సత్కరిస్తున్న జిల్లా ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధులు

కర్నూలు (అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడిగా వీసీహెచ్ వెంగళ్ రెడ్డి అందించిన సేవలు ఎనలేనివని జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం నేతలు కొనియాడారు. జిల్లా ట్రెజరీలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న వెంగళ్ రెడ్డి గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏపీ టీఎస్ఏ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ట్రెజరీ అధికారులు, ఉద్యోగులు ఆయన సేవలను ప్రశంసించారు. జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు, ఏపీజీఎల్ఐ జేడీ కృష్ణ, లోకల్ ఫండ్ ఆడిట్ అధికారి రమేష్ బాబు మాట్లాడుతూ.. వెంగళ్ రెడ్డి ట్రెజరీ ఉద్యోగులకే కాకుండా అన్ని శాఖల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులకు సేవలు అందించి వారి హృదయాల్లో స్థిరంగా నిలిచిపోయారని పేర్కొన్నారు. వెంగళ్ రెడ్డి దంపతులను ట్రెజరీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నాయకులు సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. సన్మాన గ్రహీత వెంగళ్ రెడ్డి మాట్లాడుతూ.. ఇరవై ఏళ్లుగా ఎన్‌జీఓ అసోసియేషన్ నేతగా నిస్వార్థంగా సేవలు అందించినట్లు చెప్పారు. ఏపీ టీఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, గురుమూర్తి, ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ కర్నూలు నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై 3న అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): కిడ్నీ వ్యాధులపై ఆగస్టు 3న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో సాయంత్రం 6 గంటల నుంచి సదస్సు ప్రారంభమవుతుందన్నారు. సదస్సులో కిడ్నీ వ్యాధులు–పోషకాహారం పాత్ర గురించి నెఫ్రాలజిస్టు డాక్టర్ శ్రీధరశర్మ వివరిస్తారన్నారు.

పతకాల విజేతలకు అభినందన

కర్నూలు (టౌన్): విజయవాడలోని చెన్నుపాటి రామ కోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటిన కర్నూలు క్రీడాకారులను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అభినందించారు. తైక్వాండో క్రీడాకారులు విశ్వాసరావు (వెండి), గువ్వల సూర్య భార్గవ్ (వెండి), మల్లికార్జున (కాంస్యం) పతకాలు సాధించడంతో గురువారం స్థానిక మౌర్య ఇన్‌లో వారికి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తైక్వాండో క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తైక్వాండో అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'భారత్ కి సంతాన్'కు ఎంపిక

కర్నూలు కల్చరల్: నేషనల్ యూత్ ప్రాజెక్టు వారు నిర్వహిస్తున్న భారత్ కి సంతాన్ కార్యక్రమానికి జిల్లా నుంచి ఎంపికైన టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన కూచిపూడి విద్యార్థినులను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ గురువారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. దక్షిణ భారత దేశం నుంచి మొత్తం 14 మందిని ఎంపిక చేయగా, అందులో కర్నూలు నగరానికి చెందిన లిఖిత, సత్యశ్రీ, మధుహాసిక చోటు పొందడం జిల్లాకే గర్వకారణమన్నారు. వీరు నేషనల్ యూత్ ప్రోగ్రాం వారు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటూ దేశంలోని వివిధ భాషలు, సంస్కృతి సంప్రదాయాలను వివరిస్తూ ప్రదర్శనలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలాగే టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ కేవీ భార్గవ్‌కుమార్ 14 దేశాలతో కూడిన సౌత్ ఏషియా సమైక్యత సంస్థ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలకు అభినందన

కర్నూలు కల్చరల్: తిరుపతిలో అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పద్య నాటక పోటీల్లో టీజీవీ కల్చరల్ అకాడమీ వారి ×శ్రీ వేంకటేశ్వర మహత్యం€ పద్య నాటకంలో జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న పలువురు కళాకారులను గురువారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అభినందించారు. నాటకంలోని అనంతాచార్యుల పాత్రధారి జె.మోహన్ నాయక్‌కు ఉత్తమ సహాయ నటుడు, బాల వేంకటేశ్వర పాత్రధారి మాస్టర్ సురభి యశోధర్‌కు ఉత్తమ బాల నటుడు అవార్డు లభించినట్లు నాటక దర్శకులు వి.వి.రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ నాటకాన్ని ఎమ్‌వీఎస్ ప్రసాద్ రచించారన్నారు. పలువురు సీనియర్ కళాకారులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలను అభివృద్ధి చేయండి

ఓర్వకల్లు : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలను బట్టి క్రీడామైదానాలను అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన సీపీఎం మండల కార్యదర్శి నాగన్నతో కలిసి మండల కేంద్రం ఓర్వకల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల హెచ్ఎం, ప్రిన్సిపాళ్లను, మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలల్లో ప్రధానంగా ఆటస్థలాలు, మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, స్థానిక మోడల్ స్కూల్, కస్తూర్బా స్కూళ్లలో విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలాలు వున్నప్పటికీ వాటిని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం వెనుకబడిందని తెలిపారు. జాతీయ రహదారి నుంచి ఆయా స్కూళ్లకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదని, ఉన్నమట్టి రోడ్డు పైనే రాకపోకలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే మట్టి రోడ్డు బురదమయమై విద్యార్థులు స్కూళ్లకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మల్లేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం



సాధిక్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న మేయర్ బీవై రామయ్య, కమిషనర్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన టీపీఆర్ఓ వెంకటలక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ సాధిక్ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు గౌడ్‌లను గురువారం ఘనంగా సత్కరించారు. స్థానిక నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో నగర మేయర్ బీవై రామయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. సుదీర్ఘకాలం పనిచేసిన ఉద్యోగుల సేవలను వారు కొనియాడారు. కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, దండు లక్ష్మీకాంత రెడ్డి, సాంబశివరావు, కృష్ణకాంత్, జుబేర్, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ ఇశ్రాయేలు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించాలి

- ప్రభుత్వ మైనార్టీ వసతి గృహాన్ని పరిశీలించిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు
- గేటు వేసి అడ్డుకున్న ప్రిన్సిపాల్
- ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థి సంఘం నాయకులు



భోజనాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి, మైనార్టీ విభాగం నాయకులు

కర్నూలు సిటీ: సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ల బాట కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం సంతోష్‌నగర్ వద్ద ఉన్న ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాల, వసతి గృహాన్ని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికె గౌతమ్ ఆధ్వర్యంలో మైనార్టీ విభాగం నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలో 350 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి కేవలం 3 బాత్రూంలు, 3 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల స్కూల్‌లో తరగతి గదుల్లోనే బియ్యం బస్తాలు ఉంచారని, పాత సామాన్లు పెట్టిన చోటనే తరగతులు నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు ఉడికిఉడకని భోజనం పెడుతున్నారన్నారు. కుళ్లిన కోడి గుడ్లు పెడుతుతున్నాని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా హాస్టల్ నిర్వహణ మాకు తెలుసంటూ అక్కడి నుంచి జారుకున్నారన్నారు.

ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన బ్యాగులు అప్పుడే చిరిగిపోయాయని, అతుకులు వేసిన బ్యాగ్‌లతోనే పిల్లలు తరగతులకు హాజరవుతున్నారన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు ఏడాదిగా నిలిపివేశారన్నారు. గురుకుల స్కూల్, హాస్టల్‌ను పరిశీలించేందుకు వెళ్లగా తాము రాకుండా ప్రిన్సిపాల్ గేట్లు వేయించారన్నారు. ప్రిన్సిపాల్ వ్యవహరించిన తీరుపై విద్యార్థి సంఘం, మైనార్టీ విభాగం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఫిరోజ్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చాట్ల నవీన్, కర్నూలు మండల యూత్ విభాగం అధ్యక్షుడు కోట్ల మధు, జిల్లా మైనార్టీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రియాజ్ బేగ్, విద్యార్థి విభాగం కర్నూలు మండలాధ్యక్షుడు వాల్మీకి శ్రీధర్, విద్యార్థి నాయకులు ఏజాస్ హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విస్తృత ప్రచారం



శక్తి యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసి చూపుతున్న నర్సింగ్ విద్యార్థినులు

కర్నూలు: మహిళల భద్రతకు శక్తి యాప్, వాట్సాప్ సేవలపై పోలీసులు జిల్లా అంతటా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అత్యవసర సమయాల్లో కాల్ చేసినా, మెసేజ్ చేసినా స్పందించేలా శక్తి వాట్సాప్ నంబర్‌ను రూపొందించారని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ జిల్లా అంతటా పోలీస్ స్టేషన్ల వారీగా గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు యాప్ పనితీరును వివరించారు. అలాగే బాలబాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విస్తృత అవగాహన కల్పించారు. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల విద్యార్థులకు రక్షణ, భద్రత ఉంటుందని, ప్రతిఒక్కరూ యాప్‌ను ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలని శక్తి టీమ్ బృందాలు వివరించాయి. అలాగే డయల్ 112, 181, 1098, 1930 టోల్‌ఫ్రీ నంబర్ల ఉపయోగాలు, సోషల్ మీడియా ప్రభావం, చదువుకు ఉన్న ప్రాముఖ్యత, ఈవ్‌టీజింగ్, ట్రాఫిక్ నిబంధనలు, బాల్య వివాహాలు, ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలు, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పించారు.

రుతుక్రమ శుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మహేశ్వరప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): బాలికలకు రుతుక్రమ శుభ్రతపై అవగాహన ముఖ్యమని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వరప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక ఎ.క్యాంపులోని ఇందిరాగాంధీ స్మారక మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో విద్యార్థినులకు రుతుక్రమ శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీలలో ప్రతి 28 రోజులకోసారి సహజంగా జరిగే జీవక్రియ రుతుక్రమమన్నారు. బాలికకు 10 నుంచి 17 సంవత్సరాల మధ్యలో ఎప్పుడైనా ఇది జరుగుతుందని తెలిపారు. 17 సంవత్సరాలు దాటినా రజస్వల కాకపోతే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇంట్లో తల్లులు, పాఠశాలల్లో ఉపాధ్యాయినులు అవగాహన కల్పించాలన్నారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, ఆరోగ్య కార్యకర్త మేరి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

జీతాలు పెంచే వరకు పోరాటం

కోడుమూరు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు పెంచే వరకు పోరాటం ఆపేది లేదని సీఐటీయూ మండల కార్యదర్శి గఫూర్‌మియ్యా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జీతాలను పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గఫూర్‌మియ్యా మాట్లాడుతూ.. ఏళ్లతరబడి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్నా జీతాలు పెరగకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. జీతాలు పెంచాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పదివేల జీతం ఇవ్వాలని మాత్రమే జీఓ ఉందంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో కుటుంబాలను పోషించుకునేందుకు కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి కార్మికుల జీతాలను పెంచాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు వీరన్న, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా నూతన కమిటీ నియామకం

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన కమిటీని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎ.రామకృష్ణ గురువారం ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా జ్యోతి అనితా రెడ్డి (కర్నూలు), మద్దిలేటి యాదవ్ (పాణ్యం), విక్కి వెంకటేశ్వర్లు (కర్నూలు), దుమ్మా వెంకటరాముడు (ఆలూరు), కొండా షాహీద్ భగత్ (కర్నూలు), ఎర్రవాటి వెంకటహరి (పత్తికొండ), జిల్లా ప్రధాన కార్యదర్శులుగా మాలతి (కర్నూలు), ఎస్.నాగేశ్వరరావు (పాణ్యం), జిల్లా కార్యదర్శులుగా మాదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి (పాణ్యం), మధుకిషోర్ (కోడుమూరు), మల్లెపోగు తివిక్రమ్ (పాణ్యం), గోరంట్ల రామాంజనేయులు (కర్నూలు), ఏజీవీ దయాసాగర్ (ఎమ్మిగనూరు), జి.హుసేనప్ప యాదవ్ (ఆదోని), జిల్లా కోశాధికారిగా చాకలి లోకేశ్వరయ్య (కర్నూలు), జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా కాకుమాని జగదీశ్వరాచారి (పాణ్యం), జిల్లా ఐటీ కన్వీనర్‌గా ఎస్.నవీన్ (మంత్రాలయం) నియమితులయ్యారు. ఈ కమిటీ తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

డాక్టర్ లక్ష్మీకామేశ్వరికి సన్మానం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాలలోని ఫార్మకాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ గురువారం పదవీ విరమణ చేసిన డాక్టర్ లక్ష్మీకామేశ్వరిని వైద్యులు ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మకాలజీ విభాగంలో డాక్టర్ లక్ష్మీకామేశ్వరి అందించిన సేవలను ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చిట్టినరసమ్మ, అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ హరిచరణ్, ఫార్మకాలజీ హెచ్ఓడీ డాక్టర్ రాజేష్, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.